క్లుప్తంగా

అక్రమ నిర్మాణం కూల్చివేత



కాకినాడ 49వ డివిజన్‌లో షెడ్డును కూల్చివేసిన దృశ్యం

కాకినాడ రూరల్: నగరంలోని 49 డివిజన్ పరిధిలో రోడ్డును ఆనుకుని అక్రమంగా నిర్మిస్తున్న షెడ్లను సిటీ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. రోడ్డు పక్కనే రెండు షెడ్లను విద్యుత్ స్తంభాన్ని కలుపుకొని శరవేగంగా నిర్మిస్తుండగా స్థానికులు ఆందోళనకు దిగారు. ఆక్రమణ తొలగించాలని కార్పొరేషన్ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు రాజకీయ ఒత్తిడులను లెక్క చేయకుండా రెండు షెడ్లను పడగొట్టారు. అక్రమ నిర్మాణం గురించి తమ దృష్టికి రావడంతో పరిశీలించి తొలగించే చర్యలు చేపట్టామని నగర పాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ కృష్ణారావు తెలిపారు.

6, 7 తేదీల్లో నాటికల ప్రదర్శన



అమెరికా కామెడీ నాటికల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో కాకినాడ దంటు కళాక్షేత్రంలో 'అమెరికా కామెడీ నాటికలు' ప్రదర్శించనున్నారు. నాటికల బ్రోచర్‌ను ప్రముఖ రచయిత, యూట్యూబర్ రవి మంత్రి చేతుల మీదుగా గురువారం దంటు కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొనున్న ప్రముఖ నటులు, రచయిత తనికెళ్ల భరణికి ఈ నెల 7న 'జీవన సాఫల్య పురస్కారం' ప్రదానం చేస్తున్నట్లు వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్ రాజు తెలిపారు. నాటక రంగ నిపుణులు ఆచార్య బీవీ రమణ మూర్తి, ఆచార్య డీఎస్ఎన్ మూర్తిలకు ఆత్మీయ సత్కారం చేస్తున్నట్లు దంటు భాస్కర్ తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణలో మార్ని జానకి రామ చౌదరి, ప్రభుదాసు, కట్టా కృష్ణారావు, బాలాంత్రపు సుచిత్రామూర్తి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల భారం తగ్గించిన కేంద్రం

బోట్‌క్లబ్: సామాన్యులకు కేంద్రం శుభవార్త అందించిందని, పన్నుల భారాన్ని తొలగించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ నుంచే ఈ కొత్త ధరలు అమలులోకి వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇక ప్రాణధార ఔషధాలపై జీఎస్టీ ఉండదన్నారు. వ్యక్తిగత వస్తువులపై పన్ను భారాన్ని తగ్గించి దేశీయ వినిమయాన్ని పెంచాలని, దీని ద్వారా అమెరికా సుంకాల నుంచి ఉపశమనం పొందాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. వ్యక్తిగత బీమా, ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలపై జీఎస్టీ ఎత్తివేశారన్నారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజినల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018
కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు	
ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589

ఉత్తీర్ణత వేలల్లో.. నమోదు వందల్లో

- జిల్లా ఉపాధి కార్యాలయంలో అంతంత మాత్రంగా నమోదు
- అందుబాటులోకి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ



కాకినాడలో జిల్లా ఉపాధి కార్యాలయం

బాలాజీచెరువు: ఏటా పదో తరగతి ఆపైన ఇంటర్, డిప్లమో, ఐటీఐ, ఇంజినీరింగ్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎందరో ఉంటున్నారు. వీరికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం నమోదు చేసుకోవాల్సి ఉంటోంది. ఈ నమోదు అంతంతమాత్రంగా జరుగుతోంది. నేటి యువతకు జిల్లా ఉపాధి కార్యాలయం అంటే తెలియదంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. ఏడాది కాలంలో పదో తరగతి నుంచి డిగ్రీ, డిప్లమో వరకూ దాదాపు 60 నుంచి 70 వేల మంది ఉత్తీర్ణత సాధిస్తున్నా కేవలం వందల్లో మాత్రమే నమోదవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మరింత చేరువ చేయడానికి ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో 2022లో ఆన్‌లైన్ వెబ్ పోర్టల్ ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రైవేట్ కంపెనీల ఉద్యోగ వివరాలు, ప్రభుత్వ శాఖల్లో జారీ చేసిన నోటిఫికేషన్ల వివరాలు అందులో ఉండేలా పొందుపరిచారు. నిరుద్యోగ యువత వారి విద్యార్హతలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వెంటనే వారి విద్యార్హత వివరాలు మేరకూ ఏ ఉద్యోగాలకు అర్హులో వారి మొబైల్ నంబర్‌తో పాటు రిజిస్టర్ ఈ-మెయిల్ ఐడీకి సమాచారం అందుతుంది. ప్రైవేట్ కంపెనీల్లో ఖాళీలు భర్తీ చేయడానికి ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాల సమాచారం, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల ఖాళీల భర్తీకి జారీ చేసే నోటిఫికేషన్ల సమాచారం ఈ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు నవీకరణ జరుగుతుంది.

ఎలా నమోదు చేయాలంటే..

- ఇంటర్‌నెట్‌లో ఎంప్లాయిమెంట్ ఏపీ.జీఓవీ.ఇన్‌లో జాబ్‌సీకర్‌లో అభ్యర్థుల ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ ద్వారా లాగిన్ అవ్వాలి. వారి విద్యార్హతలు, వివరాలు నమోదు చేసిన వెంటనే మొబైల్ నంబర్‌కు సమాచారం వస్తుంది. వివరాలు నమోదు చేసిన వెంటనే సంబంధిత జిల్లా ఉపాధి కార్యాలయానికి ఆ వివరాలు చేరుతాయి.
- ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలో సిబ్బంది ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ నంబరును అభ్యర్థికి పంపుతారు.
- ఏమైనా వివరాలు తప్పుగా ఉంటే, ఇంకా సమాచారం కావాలని ఉపాధి కార్యాలయ సిబ్బంది ఫోన్ ద్వారా వివరాలు తెలుపుతారు.
- ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలో నిర్వహించే విద్యార్హత పత్రాల రిజిస్ట్రేషన్, రెన్యూవల్ అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు ఈ వెబ్ పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చాయి.
- ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే కేవలం రెండు రోజుల్లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు అందుతుంది.
- ఏ విద్యార్హత లేనివారు వివరాలు నమోదు చేసుకోవచ్చు. వారి విద్యతో సంబంధం లేని ఉపాధి కల్పిస్తారు.

ప్రతి విద్యార్థికి డిజిటల్ కార్డు

ఉపాధి కల్పన శాఖలో ఇప్పటి వరకూ వివరాలు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు సంఖ్యతో పాటు ధ్రువపత్రం ఇచ్చేవారు. ఇకపై ఎంసీసీ విధానంలో ధ్రువపత్రాలు ఇవ్వకుండా డిజిటల్ కార్డులు అందించనున్నారు. ఉపాధి కార్యాలయంలో విద్యార్హతల వారీగా నమోదు వివరాలు 2023-24 వివరాల ప్రకారం.. పదో తరగతిలోపు 229 మంది, పదో తరగతి ఉత్తీర్ణులు 3,029 మంది, ఇంటర్ చదివిన విద్యార్థులు 5,682, డిగ్రీ 6,890, డిప్లమో 3,430, ఇతర విద్యార్హతలు 17,560 మంది నమోదు చేసుకున్నారు.

యువతకు ఉపయోగం



ఈ వెబ్‌పోర్టల్ యువతకు ఎంతో ఉపయోగం. విద్యకు తగ్గ ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నాం. అర్హత గల ప్రతి యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో అన్ని ప్రముఖ, ప్రైవేట్ సంస్థలతో అనుసంధానమై ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాం.

– జి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి


'సరిపెల్ల'కు సత్కారం



సంస్కృత ప్రచార సభ కార్యనిర్వాహక కార్యదర్శి సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తిని సత్కరిస్తున్న చిత్రం

బోట్‌క్లబ్: స్థానిక వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్కృత ప్రచార సాహిత్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సంస్కృత ప్రచార సభ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తిని ఘనంగా సన్మానించారు. దీనికి అధ్యక్షత వహించిన ఏయూ పీజీ సెంటర్ విశ్రాంత లెక్చరర్ టి.విశ్వనాథరావు మాట్లాడుతూ వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు చెబుతున్న విషయాలపై అవగాహన కోసం సంస్కృత ప్రచార సభ ఇటువంటి కార్యక్రమాలు తలపెట్టడం గొప్ప విషయమన్నారు. విశిష్ట అతిథి, సంస్కృత ప్రచార సభ గౌరవాధ్యక్షుడు జీవీ కృష్ణంరాజు మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు సనాతన ధర్మం పట్ల ప్రతి ఒక్కరికీ ఆసక్తి పెరుగుతోందని అన్నారు. పండితులు అష్టావధాని కందుకూరి లక్ష్మీనరసింహ మూర్తి గణపతి సాంఘిక మర్యాదపై ప్రసంగించారు. కార్యక్రమంలో సంస్కృత ప్రచార సభ అధ్యక్షుడు జీవీకే వర్మ, ప్రధాన కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, ఉపాధ్యక్షుడు గంటి నాగేశ్వరరావు, కోశాధికారి చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

కురసాల సత్యనారాయణకు ఘన నివాళులు



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కురసాల కన్నబాబు, రూరల్ మండల వైఎస్సార్ సీపీ నాయకులు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ మృతికి పలువురు సంతాపం తెలిపారు. గురువారం కాకినాడ వైద్యనగర్‌లో కన్నబాబు నివాసం వద్ద సత్యనారాయణ సంతాప కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. కన్నబాబు, ఆయన సోదరుడు కళ్యాణ్‌కృష్ణలను ఓదార్చారు. సత్యనారాయణ దశదిన కర్మలు పూర్తి చేసిన కుటుంబ సభ్యులు, హాజరైన వారికి భారీగా అన్నదానం చేశారు. సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఆయన అనుచరులు, మాజీ ఎంపీ వంగా గీత, రూరల్ నియోజకవర్గ పార్టీ నాయకులు, ఉదయం నుంచి సాయంత్రం వరకూ దగ్గరుండి వచ్చిన వారికి ఇబ్బందులు లేకుండా చేశారు. రూరల్ జెడ్పీటీసీ నురుకుర్తి రామ్మకృష్ణ, పార్టీ మహిళా విభాగం నేత జమ్ములమడక నాగమణి, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు చిన్నా, శీలం నాగేశ్వరరావు, సుంకర విద్యాసాగర్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పెదపాటి నాగబాబు, బాలాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు దంపతులు, వడ్డి మణికుమార్, ఐ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీగా మురళీధర్



కాకినాడ లీగల్: ల్యాండ్ రిఫార్మ్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎల్ఆర్ఏటీ) కమ్ కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా న్యాయవాది అద్దేపల్లి మురళీధర్ నియమిస్తూ ప్రభుత్వ సెక్రటరీ జి.ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కాకినాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ విధులు మూడేళ్ల కాలపరిమితిగా నిర్ణయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముగిసిన టీఓటీల శిక్షణ

సామర్లకోట: విస్తరణ శిక్షణా కేంద్రం పరిధిలోని శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న 11 జిల్లాల్లోని సీనియర్ పంచాయతీ సెక్రటరీలను టీఓటీలుగా ఎంపిక చేసి మూడు రోజుల పాటు స్థానిక ఈటీసీలో నిర్వహించిన శిక్షణ గురువారం సాయంత్రంతో ముగిసింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై టీఓటీలకు శిక్షణ ఇచ్చారు. రెండో బ్యాచ్‌లో 114 మందికి శిక్షణ నిర్వహించగా, వారు ఆయా మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు ఎస్ఎస్ శర్మ, కె.సునీల, ఎం.చక్రపాణిరావు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, వి.జగన్నాథం, డి.శ్రీనివాసరావు, కేఆర్ నిహారిక పాల్గొన్నారు.

పంచాయతీల పురోభివృద్ధికి సహకరించాలి

పెద్దాపురం: పంచాయతీల పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ శ్రీలలిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలకు పంచాయతీల పురోభివృద్ధి, యాక్షన్ ప్లాన్‌పై ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషి అవసరమన్నారు. పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుధ్యం మెరుగుపరిచాలని ఎంపీడీఓ కోరారు. అనంతరం పలు అంశాలపై ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. మండల విస్తరణాధికారి శేఖర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం సూర్యనారాయణ, సర్పంచులు కొత్త చక్రరావు, దిమ్మల పుష్పరత్నం, ఎంపీటీసీ భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తయిన యువతకు సర్టిఫికెట్ల ప్రదానం



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించిన ప్రతినిధులు

కొత్తపల్లి: అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ కె.నిత్యానందరెడ్డి ఆదేశాల మేరకు సెజ్ ప్రాంత గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం మహిళా నైపుణ్యాభివృద్ధి కేంద్రం, ప్రతిభ కేంద్రాల ద్వారా ఉద్యోగ అవకాశాలపై శిక్షణ పూర్తి చేసుకున్న 89 మంది యువత, మహిళలకు పెరుమాళ్లపురంలోని క్యూలే ఫార్మా యూనిట్ హెడ్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తన మేధస్సును ఉపయోగించగలిగితే ఎందులోనైనా విజయం సొంతం చేసుకోవచ్చని అన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

విద్యాబుద్ధులు నేర్పేది గురువులే..



ఎన్ఎస్ఎస్ జిల్లా మాజీ కోఆర్డినేటర్ కృష్ణారావును సత్కరిస్తున్న అధ్యాపకులు

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతంలో పనిచేసిన పూర్వ అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు ఆధ్వర్యంలో సత్కారం జరిగింది. కళాశాలలో పనిచేసిన కేఎస్ కృష్ణ, వరహాలయ్య, బాలయ్య, గంటి ముత్యాలు, వీరభద్రరావు, రెహమాన్, గొల్లపల్లి వెంకటరావు, వలవల శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ మాజీ కోఆర్డినేటర్ డాక్టర్ పీవీ కృష్ణారావు, పీబీ శర్మలను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పసుపులేటి హరిరామప్రసాద్ మాట్లాడుతూ చరిత్ర కలిగిన కళాశాలలో ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిని సత్కరించడంతో వారిలో నూతన ఉత్సాహం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంజీవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



గురజనాపల్లి హైస్కూల్‌లో సత్కారం పొందిన ఉపాధ్యాయులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కరప: మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పాఠశాల ఉపాధ్యాయులు ఘన నివాళులర్పించారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్ వీవీజీ భవానిని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీబీ రావు, ఎస్ఎన్ కుమార్, సభ్యులు కె.శివకుమార్, నరసింగరావుల ఆధ్వర్యంలో హైస్కూల్‌లోని 16 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు పాల్గొన్నారు. కూరాడలోని మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయులు వైవీఎల్ఎన్ భానుప్రకాష్, ఎంటీ గీతా అనసూయ, పీవీవీ రమణ, లోవదుర్గ, శ్రీలక్ష్మిలను పీఏసీఎస్ చైర్మన్ వెలుగుబంట్ల సూరిబాబు, విద్యా కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు సత్కరించారు.

నేడు జేఎన్‌టీయూకేలో..

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక జేఎన్‌టీయూ యూనివర్సిటీలో శుక్రవారం గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ గురువారం తెలిపారు. ఇందులో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం ఉంటుందని, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులు ఉదయం 10 గంటలకు జేఎన్‌టీయూకే అల్యూమినీ ఆడిటోరియానికి రావాలని సూచించారు.

ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్ జామ్



సామర్లకోట ఫ్లై ఓవర్‌పై బారులు తీరిన వాహనాలు

సామర్లకోట: స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గురువారం సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోయింది. బ్రిడ్జిపై అడుగడుగునా గోతులు ఉండటంతో వాహనచోదకులు ఆ గోతులను తప్పించుకునే క్రమంలో ఎడమ వైపు నుంచి కుడివైపునకు వచ్చి వెళ్లాల్సి వస్తోంది. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలకు మార్గం లేక ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. వారం రోజులుగా ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో రద్దీగా ఉండే ఫ్లై ఓవర్‌పై గోతులను పూడ్చకపోవడంపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువవుతుంది. పెద్దాపురం - రాజానగరం ఏడీబీ రోడ్డులో ఉన్న కార్పొరేట్ కళాశాలల బస్సు 40 నుంచి 50 వరకూ రావడంతో బ్రిడ్జి రద్దీగా ఉంటుంది. ఇటువంటి సమయంలో వాహనాలు నిలిచిపోయి కళాశాలల విద్యార్థులు రోడ్డుపైకి దిగడంతో రాకపోకలు సాగించడానికి అవకాశం ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనికితోడు గణేశ విగ్రహ నిమజ్జనాలకు చెందిన వాహనాల ఊరేగింపుతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేసి ఇళ్లకు చేరుకుందామనే వారు ట్రాఫిక్ సమస్యతో అసహనానికి గురవుతున్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గోతులు ఏర్పడి ఆరు నెలలైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. గోతులు పూడ్చే వరకూ ట్రాఫిక్ సమస్య తప్పదని స్థానికులు వాపోతున్నారు.

వినాయక స్వామీ.. మనసా స్మరామి



సంపత్ విజయగణపతికి బెల్లంతో అలంకరణ



కరపలో వినాయక మండపం వద్ద పూజలు



కరపలో మెరకవీధి హంస గుడి వద్ద లక్ష్మీ గణపతి హోమం చేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, సత్తిబాబు దంపతులు

కరప: భజే గణనాథా.. మనసా స్మరామి అంటూ ఆ వినాయక స్వామిని భక్తులు కొలుస్తున్నారు. గణపతి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామ గ్రామాన, వివిధ రూపాల్లో గణపతి విగ్రహాలను నిలిపి పూజాదికాలు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతున్నారు. కరపలోని మెరకవీధి హంసగుడి వద్ద శ్రీలక్ష్మి గణపతి బృందం వినాయకుడిని నిలిపింది. అక్కడ గురువారం వేద పండితుడు సాయిమణికంఠ ఆధ్వర్యంలో రుత్విక్కుల బృందం మంత్రోచ్చారణలతో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు దంపతులు, కమిటీ సభ్యులతో కలసి ఆదిదేవుడు గణపతికి పూజలు చేశారు. లక్ష్మీగణపతి హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, ఏఓ బీఎల్ నరసింహం, కార్యాలయం సిబ్బంది పాల్గొని వినాయకున్ని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గణపతికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంపత్ విజయ గణపతి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి చెరకు రసంతో అభిషేకం చేశారు. అనంతరం అష్టోత్తర పూజ వైభవంగా జరిగింది. తర్వాత బెల్లంతో స్వామివారిని అలంకరించారు. దేవదాయశాఖ జిల్లా అధికారి కనపర్తి నాగేశ్వర్రావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, ఆలయ ఈఓ వి.వెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.